


అప్పుడే మలుపు తిరిగిన నాకు కాస్తంత దూరంలో తిరుపతిరావు మాస్టారు కనిపించారు. అందుకోవాలని నడక వేగం ఎక్కువ చేశాను. అంతలో ఓ కారు మాస్టారి పక్కనుండి దూసుకు పోబోయి, అనుకోకుండా ఆయన అడ్డంగా రావటంవల్ల ఆగిపోయింది.

నేను కంగారుగా సమీపించాను.

ఆ కార్లోని వ్యక్తి తలుపు తీసి నిర్లక్ష్యంగా చూస్తూ, "బ్రతకాలని లేదా?" అన్నాడు. మాస్టారు చిన్నగా నవ్వి, "క్షమించండి" అన్నారు. ఆ వ్యక్తి పక్కన ఆ కారులాగా అతి విలాసంగా కూర్చుని ఉన్న యువతి అడివి మనిషిని చూస్తున్నంతగా సంబరపడిపోయింది. దొండపళ్ళు లాంటి రంగు పూసిన పెదాలను బద్ధకంగా కదిపి, "పూర్ ఫెలో! లెట్స్ గో" అంది. కారు వేగంగా దూసుకు పోయింది.

వెళుతున్న ఆ కారువంకే చూస్తూ నిలుచున్నారు మాస్టారు.

"ఏమయింది, మాస్టారూ?" అని అడిగాను.

"ఏదో ఆలోచిస్తూ కారు కడ్డంగా వచ్చాను."

"పెద్దవారు! మీకు తెలియందేముంది! రోడ్డుమీద పరధ్యానంగా ఉంటే ఎంత ప్రమాదం! వెంట్రుక వాసిలో తప్పిపోయిందిగానీ . . ."

"కారు గూర్చేనోయ్ ఆలోచిస్తున్నాను. వాళ్ళెంత అదృష్టవంతులో కదా! ప్చ్! అది సరేగానీ, ఆదేం కారోయ్, అంత పొడుగ్గా, షోగ్గా ఉంది?" అన్నారాయన జరిగింది మరిచిపోతూ.

"అదేదో ఇంపాలావో ఏదో అంటారండి. ఎయిర్ కండిషన్డ్ కారట."

"అయితే లోపల చాలా చల్లగా ఉంటుందన్న మాట" అని ఉత్తరీయంతో ముఖం తుడుచుకుంటూ, "నాకు తెలియక

**ప్రమాదేచ దీపావళి కథల పోటీలో మూడవ బహుమతి పొందినది**

అడుగుతాను, గదులే కాకుండా కార్లు కూడా ఎయిర్ కండిషన్డ్‌వి ఉంటాయిటోయ్?" అన్నారు ఆశ్చర్యంగా.

"ఉంటాయిలు, మాస్టారూ. డబ్బుంటే లైఫంతా కండిషన్డే కదండీ! లేకపోతే మన ఊరి ఎండల్లాంటివే బ్రతుకులు."

"అవునోయ్, అక్షరాలా నిజం. . . అప్పట్టు నువ్వెప్పుడన్నా కారెక్కావా? పోనీ, ఎక్కాలనిపిస్తుందా?"

"లేదు, మాస్టారూ, నా కెప్పుడూ ఎక్కాలన్న కోరిక కలగలేదండీ. అందుబాటులో లేనిదానికోసం చేతులు చాపితే మటుకు ప్రయోజనం ఏముంటుంది? అందుకని ఆ ఆలోచనలే రావు."

"అదృష్టవంతుడివి, సుదర్శనం. . . నా చిన్నప్పటినుండి కారెక్కాలన్న కోరిక కట్టుకున్న పెళ్ళాం నోటికన్నా అధికంగా వేధించుకు తింటూంది. ఆ ఒక్క బలహీనతకీ దాసుణ్ణయిపోయానోయ్ . . . నా కొక్కోసారి అనిపిస్తుంది, రిటైర్ కాబోతున్నా ఈ చిన్న కోరిక తీర్చుకోలేని బ్రతుకుని ఈడ్చినా పూడ్చినా ఒక్కటేనని! కాని, బాధ్యతలనుండి తప్పుకుని పారిపోలేను. అందుకే నా చుట్టూ ఓ ఊహాప్రపంచం సృష్టించుకుని అందులో బ్రతకటం నేర్చుకున్నాను. నాకు ఒకింత తృప్తి నిచ్చేవి ఈ ఊహలే! పాపం, ఈ ఊహలు ఇంట్లో ఉండగా నా దరిదాపుల్లోకి రావు. వాటికి మా సంసార సాగరమంటే తగని భయం! ఇహ పోతే స్కూల్లో సరేసరి. ఆ వ్యాపకంలో పడ్డాక అవి నా దగ్గరికి రాలేవు; రానివ్వను. మిగిలిందల్లా స్కూలుకీ, ఇంటికీ మధ్యనున్న ఈ రోడ్డు, నిద్ర! ఈ రోడ్డు పట్టినప్పుడు, కంటి కింత కునుకు పట్టినప్పుడు మాత్రం అపురూపమైన ఊహాల్లోకో, స్వప్నాల్లోకో జారిపోతుంటాను. వాటినుండి తప్పించుకోలేనోయ్. ఛస్తే తప్పించుకోలేను . . ."

నేను మౌనంగా వింటున్నాను.

"నిన్న రాత్రి కల వచ్చిందోయ్ ... రూపాయి ఇచ్చి కొన్న లాటరీ టికెట్టుకి లక్ష రూపాయలూ, ఓ కారూ వచ్చాయి, నోటి దురుసుతనం లేని భార్య, ఒకే ఒక కొడుకు కార్లో నా పక్కన కూర్చున్నారు. కారు స్టార్ట్ చేశాను. అంతేనోయ్! పెళ్ళున కేకలేస్తూ మా ఆవిడ లేపేసింది. 'చాల్లెండి సంబడం! మన కిదాహాటే కాసీ ఖర్చు లేకుండా వస్తుందని గుర్రు పెట్టి నిద్రపోతే ఇహ అయినట్లే! ఈ రోజు మీ గొప్పతోక ఉద్యోగానికి వెళ్లరా? వచ్చేటప్పుడు పదో పాతికో పట్టుకు రండి. మరిచిపోయారో వస్తుతే! పైగా అబ్బాడికి ఒళ్ళు కాలి పోతూంది. మీ అమ్మగారి ఆయాసం మండిపోతుంది, ఎంతో కొంత మొహాన కొడితే తప్ప ఆ డాక్టరు ముండా వాడి మొహం చూట్టం కష్టం. . . కిరాణా వెధవ ప్రాణం తింటున్నాడు. . . పాలగాడిది సరేసరి! ఈ సుఖాలన్నీ చాలవన్నట్టు నిద్దట్లో కేరింతలూ, పలవరింతలూ, ముసిముసి నవ్వులూను! లేవండి, లేవండి' అని దీవిస్తూ లేపి చర్రున వెళ్ళిపోయింది. నిజం చెప్పద్దూ, ఒళ్ళు మండిపోయింది. మరో నిమిషం అవకాశం ఇచ్చి ఉంటే కారు డ్రైవ్ చేసినట్లుండేది కదా!" అన్నారు.

నేను మాట్లాడక పోవటంతో, "నిన్ను విసిగిస్తున్నానటోయ్, మరీ అంత మౌనంగా ఉన్నావు?" అన్నారు మళ్ళీ నవ్వుతూ.

"లేదు, మాస్టారూ, నేనూ ఆలోచిస్తున్నాను. అంతా ఒకే మాదిరి పుట్టినా, ఒకే మాదిరి మరణించినా భోగభాగ్యాలు కొందరికీ, పేదరికం కొందరికీ ఎందుకు పరిమితం కావాలి? ప్రతి వ్యక్తి ఈ భూమిమీద పుట్టినప్పుడు ఈ భూమిని కొందరే ఎందుకు పంచుకుని అనుభవిస్తున్నారు? నా కనిపిస్తూంది, మాస్టారూ. . . దేవుణ్ణి దేవుడని దేవిరించటమే కాని, దేవుడు

# కోర్కె తీరింది

—వి. వి. సూర్యనారాయణ

లేనేలేడు. ఉంటే అందరూ సమానంగా ఉండి ఉండరు. మా పిల్లలంతా ఒకే మాదిరి సుఖసంతోషాలతో ఉండాలని మా ఉనుకోవా? మా దృష్టిలో మా పిల్లలంతా ఒకటి కాదా?" అన్నాను ఆవేశంతో.

"దైవ దూషణ వల్ల ప్రయోజనం లేదు, సుదర్శనం! నువ్వు బాంక్‌లో ఎంత వేసుకొస్తే భవిష్యత్తులో అంత సుఖం నీకు లభిస్తుంది. మనం గత జన్మలో వేసుకొనుకున్న పుణ్యంబట్టి ఈ జన్మలో అదృష్టం నిర్ణయించ బడుతుంది. అప్పులు చేసేవాడు ఆ బాధ తట్టుకోక తప్పనట్టే, పాపం చేసే వాడు దాని ఫలితం అనుభవించక తప్పదు. పుణ్యం బాంక బాలెన్సు అయితే, పాపం కాబూలీవాడి అప్పు! ఇహ దైవచింతన దేని కంటావా? పాపభీతి కలిగి ఉండటం కోసం. అంతేగానీ, నువ్వు పాపం చేసి, 'దేవుడా, నన్ను క్షమించు' అంటే కుదరదు. . ."

స్కూలు చేరుకోవటంతో సంభాషణ ఆపి ఇద్దరం స్కూల్లో ప్రవేశించాం.

* * *

తిరుపతిరావు మాస్టారు నాలాగే సెకండరీ గ్రేడు టీచరు. ఆయన దాదాపు సర్వీసు చివరి మెట్టు దగ్గర, నేను మొదటి మెట్టు దగ్గర ఉన్నాం. చదువు కొనే రోజుల్లో ఆయనకు నేను ప్రియ శిష్యుణ్ణి. అందుకే ఆయన నన్ను చనువుగా 'ఏం వోయ్' అంటారు. నేను చూసిన ఉపాధ్యాయుల్లో అంతటి సౌజన్యమూర్తి, సహనశీలి మరెవ్వరూ లేరు. శాంతం మూర్తీభవించిన మాస్టారు ఉపాధ్యాయుడు అన్న పదానికి చక్కని నిర్వచనం! అటు జీవితంలో ఎదుర్కొనే ఒడుదుడు కులకీ, ఇటు ఉద్యోగ నిర్వహణకీ ముడి పెట్టని వ్యక్తి బహుశా ఆయ నొక్కరేనేమో!

మాస్టారికి పది మంది పిల్లలు. మొదటి ఇద్దరు కొడుకులూ ఎక్కడో దూరంగా ఉద్యోగాలు చేసుకుంటున్నారు. కేవలం వాళ్ల కాళ్లపై నిలబడగలిగిన ఉద్యోగాలు కావటం వల్ల వాళ్లనుండి ఆయ నేమీ ఆశించలేరు. మిగిలిన ఎనిమిది మంది పిల్లలతో, ఎప్పుడూ రోగంతో బాధపడే తల్లితో, నోటి దురుసు భార్యతో సంసారాన్ని నెట్టుకువస్తున్న ధీశాలి ఆయన. జీతపురాళ్ళు, ప్రైవేట్ల జీతాలు ఏ మూలకీ రాకపోయినా, కేవలం మంచి తనాన్ని, సిండివిజ్ఞాన్ని (?) రెండు చక్రాలుగా చేసుకొని సంసారాన్ని ఈడుస్తున్నా రాయన.

మాస్టారికి చిన్ననాటినుండి ఒక కోరిక ఉంది.

ఒక్కసారి కారెక్కాలన్న ఆ కోరిక ఈ నాటికీ తీరలేదు!

కార్లో తిరగాలన్న కోరిక ఊహా మాత్రంగా నా బోటి వాళ్లకు ఎప్పుడన్నా కలగటం సహజం కావచ్చు. కాని, మాస్టారికి మళ్లే దాన్ని చావకుండా నీళ్లు పోసి పెంచటం బహుశా ఎవ్వరూ చెయ్య రేమో! అంతటి నిండు వ్యక్తిత్వం గల మాస్టారు ఇటువంటి కోరిక నెందుకు పెంచుకున్నారో అర్థం కాదు.

ఇద్దరం కలిసినప్పుడు కనీసం ఒక్క సారన్నా కారు విషయం దొర్లించక మానేవారు కాదు.

తన కోరిక తీర్చుకోవాలని అనేక పర్యాయాలు ప్రయత్నించారు. కొత్త ప్రైవేట్లు ఒప్పుకున్నప్పుడల్లా టాక్సీలో తిరగాలని పథకం వేసుకునేవారు. కాని, ఆ పని చేయబోయేసరికి ఏదో ఒక అవసరం గ్రద్దలా తన్నుకుపోయేది!

ఒకసారి అతి కష్టం మీద మాస్టారి కోసం పది రూపాయలు మిగిల్చాను. ఆయనకు నా ఆలోచన చెప్పాను. మహదా నందం పొందారు. అంతా నిర్ణయం చేసుకుని ఆయన కోసం ఆ సాయంత్రం ఎదురుచూస్తూ కూర్చున్నాను. అంతలో నీరసంగా వచ్చారు మాస్టారు.

"అలా ఉన్నారేం, మాస్టారూ, మనం వెళ్లద్దూ?" అన్నాను.

"దేనికైనా రాత ఉండాలి కదుటోయ్" అన్నారు.

"ఏమయిందండీ?" అని అడిగాను.

"ఏం లేదోయ్. తరవాత చూద్దాం షికారు సంగతి. ముందర ఆ పది ఇటివ్వు" అన్నారు చెయ్యి చాపుతూ.

"ఇదిగో, తీసుకోండి, మాస్టారూ" అంటూ ఇచ్చి, "అస లేం జరిగిందండీ?" అని అడిగాను మరోసారి.

"మా రెండో అమ్మాయి మూల కూర్చుంది" అంటూ వడివడిగా వెళ్లి పోయారు.

* * *

సాయంత్రం స్కూలు విడిచిపెట్టాక ఇద్దరం ఇళ్లకు బయలుదేరాం. గేటు దాటబోతూ ఉంటే ఆరో తరగతి అమ్మాయి వాణి పరుగెత్తుతూ వచ్చింది

"మాస్టారూ" అం టూ. వాణి మాస్టారి దగ్గిర ప్రైవేటు చదువుతూ ఉంది.

"ఏం, అమ్మా" అని అడిగారు.

"ఏం లేదు, మాస్టారూ. . . రేపు ఆదివారం కదండీ. కార్లో సినిమాకెళ్తున్నాం. మీరు వస్తే నాకు సంతోషమన్నారు మా నాన్నగారు" అంది.

మాస్టారు నిరుత్తరులయ్యారు. మాస్టారు మాట్లాడకపోవటం చూసి వాణి అంది: "ఏం మాస్టారూ, రాలేరా?"

"ఆఁ! ఎందుకు రాలేనమ్మా. . . తప్పకుండా వస్తాను. అది సరే, కారెప్పుడు కొన్నారు? నాకు తెలియదే!"

"మా మామయ్యదండీ. మామయ్యేదో ఊరెళితే నాన్నగారు తెచ్చారు."

"సరేనమ్మా, వస్తాను. ఎన్నింటికి?"

"ఉదయం ఆరింటికి మా ఇంటికి వచ్చెయ్యండి. మళ్లీ సాయంత్రం వచ్చేస్తాం విశాఖపట్నం చూసుకుని" అని, "మాస్టారు ఈ రోజు ప్రైవేటు వద్దండీ. నాన్నగారితో బజా రెళతాను" అంది నెమ్మదిగా.

"అలాగేనమ్మా" అన్నా రాయన నవ్వుతూ.

"మాస్టారూ, మీరుకూడా వస్తారా?" అని అడిగింది నన్ను.

ఆ చిన్న వయసులో మూర్తీభవించిన సంస్కారానికి ముగ్ధుణ్ణయ్యాను. ఆ సంస్కారం వెనక తలిదండ్రులుండడే కాక, మాస్టారి ప్రభావంకూడా ఉందని నాకు తెలుసు.

"లేదమ్మా, నాకు పని ఉంది" అన్నాను.

వాణి హడావుడిగా వెళ్లిపోయింది.

"మీ కోరిక తీరబోతోంది, మాస్టారూ. నాకు చాలా సంతోషంగా ఉంది" అన్నాను.

సమాధానంగా చిరునవ్వు నవ్వి, "మువ్వా రాకూడదటోయ్. వాళ్ల కుటుంబం మొత్తం నలుగురే. నేను చెపుతానులే" అన్నారు.

"చేనో పని పెట్టుకున్నాను, మాస్టారూ. మీరు వెళ్లండి. మీరు వెళితే నేను వెళ్లినంతగా సంతోషిస్తాను" అన్నాను.

ఆ సాయంత్రం ఆయన హడావుడి అంతా ఇంతా కాదు. నా దగ్గర ఓ అయిదు రూపాయలు తీసుకున్నారు. ప్రైవేట్లకి సెలవిచ్చారు. మూడు నాలుగు సార్లు ఉడిచి పెట్టి చాకలి నుండి తెచ్చిన లాల్చీ, ఉత్తరీయం దగ్గరుండి పెంపుడించుకుని పెట్టుకున్నారు. పాత చెప్పులకి పాలిష్ చేయించారు.

బహుశా ఆ రాత్రి ఆయన తృప్తిగా నిద్రపోయి ఉంటారు.

* * *

ఉదయం ఏడు గంటల ప్రాంతంలో వరిగ్గా ఈజీచెయిర్లో కూర్చుని క్రితం రోజు పేపరు చదువుతున్నాను. గేటు చప్పుడు అయింది. పేపరు అడ్డు తొల గించి చూసి నిర్ఘాంతపోయాను.

మాస్టారు!

అంతలో దగ్గరకు రాగానే లేచి ఈజీ చెయిర్ఇచ్చి నేను ఇంకో కుర్చీలో కూర్చు న్నాను, "వెళ్లలేదా, మాస్టారూ?" అంటూ.

"మరోసారి హూష్‌కాకీ అయిపోయిం దోయ్" అన్నారు నవ్వుతూ. ఆ నవ్వులో బాధ ఉంది; బరువు ఉంది; లీలగా విరక్తి కనిపించింది.

నా మనసు చివుక్కుమంది. ఒక వైపు బాధ, వేరొక వైపు జాలి నన్ను మాట్లాడనివ్వలేదు. మౌనంగా చూస్తూ ఉండిపోయాను.

"ఏమైందని అడగవేం?"

"ఏమైంది, మాస్టారూ?"


"ఈ సారి కారు మూలకూర్చుంది."

"నిజంగా బాడ్ లక్, మాస్టారూ!" అన్నాను బాధపడుతూ.

"మనది బేడలక్కే కదుటోయ్, రూపాయి లక్కుంటే బాగానే ఉండును. పాపం, వాళ్ళు చాలా నొచ్చుకున్నారు. నిన్న రాత్రి ఎక్కడినుండో వస్తుంటే నా ఆశలాగే దాని డైనమో కాలిపోయిం దట. బహుశా నేను బయలుదేరకపోయి ఉంటే అది కాలిపోకపోను. సర్లే! సాయం చెయ్యాలి నువ్వు. మరేం లేదు. సాయంత్రం వరకూ మీ ఇంట్లో ఉంటాను. ఇక్కడ ఉన్నట్లు మా ఇంట్లో తెలియకూడదు. మరి ఉండనుంటావా?" అన్నారు.

"అదేమిటి, మాస్టారూ! అంతకన్నా కావలసిం దేమిటి నాకు? తప్పక ఉండండి" అన్నాను సంతోషంగా.

"అది సరే ఎందుకని అడగవేం?"




# విజయం అతని తల కెక్కిందా ?

ఫరూక్ ఇంజనీర్ చిరునవ్వు నవ్వుతున్నారు.

"నిజానికి దేనినీ నా తలకెక్కనీయను—ప్రోటీన్ భరిత బ్రిల్‌క్రీమ్ తప్ప. బ్రిల్‌క్రీమ్ నా కురులను ఆరోగ్యంగా, చెదరకుండా ఉంచుతుంది. అదే నాకిష్టం."

బ్రిల్‌క్రీమ్‌లోని ప్రోటీన్ కేశాల కుదుళ్లను గట్టి పరచి కేశాలను పోషిస్తుంది. మీ కేశాలను రోజంతా ఠీవిగా ఉంచుతుంది. పైగా ఇది జిడ్డు లేనిది, జిగురుగా అంటనిది; కేశాల పొందికకు అధునాతనమైనది. మీరు కూడా ఫరూక్‌ను అనుసరించండి. ప్రోటీన్ భరిత బ్రిల్‌క్రీమ్ వాడండి.




BF-3191 TEL

ప్రోటీన్ భరిత
బ్రిల్‌క్రీమ్
అందమయిన కేశాలకు ఆరోగ్యమయిన మార్గం


నే నేదో అనబోయాను. కానీ, మళ్లీ ఆయనే అందుకుని అన్నారు: "అవ గింజంతైనా స్వార్థం లేనిదే మనిషి ఏ పనీ చెయ్యడనుకుంటాను. ఒక్క పూట భోజనానికి రమ్మని నువ్వు అనేక పర్యాయాలు ఆహ్వానిస్తే ఏదో సాకు చెప్పి తప్పించుకునేవాడిని. ఇప్పుడు నా అవసరం కాబట్టి నేనే వచ్చాను. కారణం తెలుసా? ఇంటికి వెళితే మా ఆవిడ దెప్పి పొడుస్తూనే ఉంటుంది, ఆగిపోయిన నా ప్రయాణం గురించి. అది భరించ లేక."

తల వంచుకుని మౌనంగా ఉండి పోయాను.

* * *

ఆ తరవాత తల్లి మరణం ... భార్య సుస్తీ ... ఒక దాని వెంబడే ఒకటి ఆయన్ని క్రుంగదీశాయి. తేరుకునేందుకు వ్యవధైనా లేకుండా ఆయన జీవితం చివరి మలుపు తిరిగి చివరి మజిలీ చేరు కుంది!

ఆయన రిటైరయ్యారు!

"అసమర్థుని రిటైర్‌మెంటోయ్ ఇది" అన్నారాయన నవ్వుతూ.

అందుకు నేను సమాధానం చెప్పలేక పోయాను. కాని, నాకు తెలుసు. అసమర్థుడు కాడని నే నెరుగుదును. ఆయన నిబ్బరమైన వ్యక్తి; నిండు మనిషి. అడుగడుగునా ఎదురయ్యే విషాన్ని చిరునవ్వుతో మింగడం ఎవరికి సాధ్యం?

భార్య తేరుకున్నదో లేదో ఆయన మంచం ఎక్కారు!

ఒక రోజు విపరీతమైన గుండె పోటుతో గవర్నమెంట్ హాస్పిటల్లో అడ్మిటయ్యారు.

మరీ అంత ప్రమాదం కాదుగానీ ఇకముందు జాగ్రత్త అవసరం అని చెప్పారు. ఏవో మాత్రలు రాసి నెప్పి వచ్చేటప్పుడు వేసుకోవాలని, ఎక్కువ అలసట కలిగించే పనులు చెయ్యకూడదని, శారీరకంగానే కాక మానసికంగా కూడా బాగా విశ్రాంతి కావాలని అన్నారు.

"విశాఖపట్నం వెళ్లి చూపించు కుంటే బాగుంటుంది, మాస్టారూ ... అక్కడ స్పెషలిస్టు లుంటారు" అన్నాను.

"అక్కడ గోడలు కూడా చేతులు చాపుతాయట, సుదర్శనం! అయినా, పోయే ప్రాణాన్ని ఈ డాక్టర్లు ఆపగల రటోయ్, నీ పిచ్చిగాని! నే నీ ఊళ్లోనే పుట్టాను. ఈ ఊళ్లోనే మట్టిగలిసి పోనీయ్. కాకపోతే నా దొకటే చింత. పిల్లల్ని కన్నందుకు కనీసం ఒక్క కూతురైనా పెళ్లిపీట ఎక్కటం చూసి సంతోషించగలనో లేదో! ఆ భాగ్యం ఉందో లేదో! లక్ష్మికి పెళ్లి వెదిగి ఉంది. దాని పెళ్లయినా చూడగలిగితే కొంత తృప్తి నాకు. కానీ, ఎలా? ఎలా సాధ్యం? జీవితంలో ఒక చిన్న కోరిక తీర్చుకోలేక చిత్తుగా ఓడిపోయిన నేను పెళ్ళెలా చెయ్యగలను?" అన్నారు.

"ఊరికే మనసు పాడుచేసుకోకండి, మాస్టారూ. అది మీకు ప్రమాదం కూడాను. పది రూపాయ లిచ్చి మిమ్మల్ని కార్లో తిప్పలేకపోయినా, మీ కష్టం తరం లేకపోతే కానీ ఖర్చు లేకుండా లక్ష్మిని నేను పెళ్లి చేసుకుంటాను. మీరు నిశ్చింతగా ఉండండి" అన్నాను.

ఆయన నమ్మలేనట్లు చూశారు. "నిజంగానా, సుదర్శనం!... నువ్వు నిజంగా అంటున్నావా?" అన్నారు ఆశ్చర్యంగా చూస్తూ.

"నిజం మాస్టారూ. అల్లిబిల్లి ఆలోచనలతో నిష్కారణంగా ఆరోగ్యం చెడ గొట్టుకోకండి. లక్ష్మిని నేను పెండ్లి చేసుకుంటాను" అన్నాను మరోసారి భరోసా ఇస్తూ.

ఆయన నిట్టూరుస్తూ, "దానికన్నా అంతో ఇంతో కావాలి కదా, సుదర్శనం" అన్నారు నెమ్మదిగా. "అప్పుడే నే అర్హత కోల్పోయానోయ్. ఆ విషయంలోకూడా రిటైరయి పోయాను" అన్నారు మళ్లీ.

"మన దేశంలో కొన్ని అర్హతలు కొందరికే పరిమితం, మాస్టారూ... కాని, వివాహార్హత అందరికీ ఉంది. ఏ కోరిక తీర్చుకోవాలన్నా అంతో ఇంతో డబ్బు కావాలి. వివాహానికో ఆర్థిక స్థోమతు అక్కరలేదు! అడుక్కునే వాడూ, ఆకాశంలో ఎగిరేవాడూ పెళ్లిళ్లు చేసు కుంటూనే ఉంటారు. ఆడంబరా లుంటేనే పెళ్ళని నే నెన్నడూ అనుకోను. దైవ సమక్షంలో ఒకటవుతాం. నన్ను తీర్చి దిద్దిన మీ ఋణాని ఇలా తీర్చుకో నివ్వండి."

"చాలా సంతోషం సుదర్శనం. కారెక్కాలని నే ననేక పర్యాయాలు ఆశించాను. కాని, వీలు కాలేదు. ఈ రోజు లక్ష్మి పెళ్లి విషయం మొదటి సారి నీతో అన్నాను. అది క్షణంలో పరిష్కరింప బడింది. ఇందుకేనేమో, సంకల్ప వికల్పాల్ని మన చేతిలో లేవంటారు" అని జలజల రాలుతున్న కన్నీళ్లు తుడుచుకుంటూ, "నాకు కారెక్కినంత సంబరంగా ఉందోయ్" అన్నారు.

చలించిపోయాను. నాకు తెలిసిన తిరుపతిరావు మాస్టారి కళ్లలో ఎన్నడూ తడి చూసి ఎరగను. మేరుపర్వతం నీళ్ళు చిమ్మటం నా ఊహ కందని విషయం. వాస్తవాన్ని తట్టుకోలేక నా కళ్ళు కూడా వర్షించాయి.

* * *

క్రమంగా కోలుకున్నారు మాస్టారు. నేను లక్ష్మిని పెళ్లిచేసుకున్నాను.

కాని, మాస్టారి కోరికమాత్రం తీర్చలేకపోయాను!

అదే నాకు అర్థంకాని విషయం. మధ్యతరగతి కుటుంబీకులు కేవలం నిమిత్తమాత్రులు అన్నారు మాస్టారోసారి. అందులోని నిజం నాకు అర్థమయింది. ఎంతటి నిస్సహాయులీ మధ్యతరగతి మానవుడు! ఆ పూట అవసరం ఎంత గొప్పదైనా ఎలాగో తీరుతుంది. కాని, కోరిన కోరిక ఎంత చిన్నదైనా గగనమే!

*   *

కొన్నాళ్ల తరవాత పెన్షన్ విషయమై విశాఖపట్నం బయలుదేరారు మాస్టారు. ఆయన ఆరోగ్యం దృష్ట్యా తోడు ఉండటం మంచిదని నేనూ బయలుదేరాను.

కొంత సెలవు బదులు తీసుకుని పట్టుకున్నాను, మాస్టారి కోరిక తీర్చాలనే ఉద్దేశంతో. టాక్సీలో సింహాచలం తీసుకువెళ్లాలని నా ఆలోచన.

డి. ఇ. ఒ. ఆఫీసు దగ్గర అనుకోకుండా మా ఊరి వెంకట్రావు మాస్టారు కనిపించారు.

వెంకట్రావు మాస్టారు, తిరుపతిరావు మాస్టారు కొన్నాళ్ళ తేడాలో రిటైరయ్యారు. మంచి స్నేహితులు.

ముగ్గురం ఆ రోజంతా ఆఫీసులో పడిగాపులు పడి పని ఒక కొలిక్కి తెచ్చుకుని బయట పడేసరికి మాస్టారి చేతిలోనిది పూర్తిగా ఖర్చయిపోగా, నా చేతిలో మిగిలినది కేవలం పది రూపాయల చిల్లర! నా కళ్ళు చెమర్చాయి. అయితే, నా ఆలోచన ముందరే ఆయనకు చెప్పకపోవడం, ఇటు పని అంతో ఇంతో సానుకూలం కావటంతో నాకు కొంత ఊరట కలిగింది.

*   *   *

బయలుదేరే ముందు, "కాస్త నొప్పి వస్తున్నట్లుందోయ్" అన్నారు మాస్టారు. వెంటనే ఓ మాత్ర జేబులో నుండి తీసి నాలుక క్రింద పెట్టుకున్నారు. కాని, ఎప్పటిలా నొప్పి తగ్గుముఖం పట్టలేదు. ప్రయాణం వాయిదావేసి పెద్దాసుపత్రికి బయలుదేరాం. వెంకట్రావు మాస్టారు మమ్మల్ని అనుసరించారు.

ఆస్పత్రి దగ్గర బస్సు దిగినప్పటి నుండి నొప్పి మరింత ఉద్ధృతం అయింది. "ఏదో ఒకాటి ఇప్పించవోయ్, సుదర్శనం... భరించలేకుండా ఉన్నాను" అన్నారు మాస్టారు.

"ఇదిగో, మాస్టారూ, ఆస్పత్రికి వచ్చేశాం. మీ రేం కంగారుపడకండి..."

"భరించ శక్యం కావటంలేదోయ్."

మళ్ళీ అన్నారు నెమ్మదిగా.

ఆయనకు ధైర్యం చెబుతూ కాజువాలిటీకి తీసుకువెళ్లాం.

"భరించలేనోయ్" అంటూనే ఉన్నారు.

*   *   *

ఏదో ఇంజెక్షన్ ఇచ్చి వార్డుకి పంపించారు.

"భరించలేనోయ్... భరించలేనోయ్."

అంటూనే ఉన్నారు స్ట్రెచర్ మీద.

వార్డు చేరేసరికి ఆ మాట ఉచ్చరించే స్థితిని కూడా కోల్పోయారు. స్నానం చేసినట్లుగా ఒళ్లంతా చెమటతో తడిసిపోయింది. గుండె చేత్తో పట్టుకుని నొప్పితో చుట్టుకుపోతుంటే కన్నీళ్ల పర్యంత మయింది నాకు.

ఆక్సిజన్ పెట్టారు.

బ్లడ్ ప్రెషర్ చూసి నరంలోకి ఏదో ఇంజెక్షన్ చేశారు.

ఇ. సి. జి. అట తీశారు.

అది చూసి డ్యూటీ డాక్టర్ హౌస్ సర్జన్‌తో ఏదో చెప్పారు. అదేమిటో అడగనూలేక, తెలుసుకోనూలేక బిక్క ముఖంతో చూస్తూ నిలుచున్నాను.

వెంకట్రావు మాస్టారు నాకు ధైర్యం చెబుతూ నా పక్కనే నిలుచున్నారు.

ఉన్నట్లుండి పరిస్థితి విషమించింది.

బ్లడ్ ప్రెషర్ బాగా పడిపోయిందట.

అటూ ఇటూ పరిగెడుతున్నారు. పరిస్థితి చెయ్యిదాటి పోతున్నదని ఆ హడావుడే చెబుతూంది. నా కేం తోచలేదు. ఏం చెయ్యను? ఏం చెయ్యగలను?

నా కళ్లెదుటే మాస్టారి ప్రాణం కొట్టుకుంటూ ఉంటే నిస్సహాయుంగా ఉండిపోయాను.

బ్లడ్ ప్రెషర్ పెంచేందుకు ప్రయత్నాలు మొదలయాయి.

కాని, నరం దొరకలేదు.

డాక్టర్ల ప్రయత్నం మానలేదు.

కళ్లు మిూతలు పడిపోతున్నాయి. బలవంతాన తెరుచుకుంటున్నాయి.

నరంకోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు.

మానవ ప్రయత్నాలను పరిహసిస్తూ గుప్పెడు ప్రాణం గాలిలో కలిసిపోయింది.

గుండెలోకి ఇంజెక్షన్ చేసి చేత్తో రుద్దటం మొదలుపెట్టారు.

కాని, నిశ్చలమైపోయిన ఆ కళ్లకు చలనం రాలేదు.

నిశ్చింతగా మారిపోయిన ఆయన ముఖం తిరిగి చింతాక్రాంతం కాలేదు! బాధకు చోటివ్వలేదు!

*   *   *

నాకు కర్తవ్యం బోధపడలేదు. నోట మాట రాక కన్నీళ్లతో వెంకట్రావు మాస్టారి వంక చూశాను.

"ఇటువంటి సమయంలోనే గుండె నిబ్బరం కావాలి, సుదర్శనం. జరగబోయేది ఆలోచించాలి, జరిగిపోయింది కాదు" అన్నారు నా భుజం తడుతూ.

అంతలో డాక్టర్ వచ్చి మా చేతిలో ఓ కాగితం పెట్టి, "వెరి సారీ ... మీరు శవాన్ని తీసుకుపోవచ్చు" అంటూ వెళ్లిపోయాడు.

"ఏం చేద్దాం, మాస్టారూ?" అన్నాను వెంకట్రావు మాస్టారితో.

ఆయన ఒక్క క్షణం ఆలోచించి, "నువ్విక్కడే ఉండు ... ఇప్పుడే వస్తాను" అంటూ వడివడిగా వెళ్లిపోయారు.

శూన్యమైన మనస్సుతో మాస్టారి వంక చూస్తూ నిలుచున్నాను. 'భరించలేనోయ్' అని నా చెవిలో వినిపిస్తున్నట్లే ఉంది. 'జీవితం నుండి కూడా రిటైరయిపోయానోయ్' అని మాస్టారు నాతో అంటున్నట్లే ఉంది. పెల్లుబికే దుఃఖాన్ని బలవంతాన అణిచిపెట్టుకుని ఉండిపోయాను.

ఎంతసేపయిందో తెలియదు.

"పద, సుదర్శనం. బయలుదేరు."

వెంకట్రావు మాస్టారి కంఠం విని ఉలికిపడి చూశాను. "ఎలా, మాస్టారూ?" అన్నాను బిత్తరపోయి చూస్తూ.

"టాక్సీ తెచ్చాను. రెండు వంతల ఏళ్ళైనా, ఆలోచిస్తూ కూర్చుంటే ప్రయోజనం లేదు. పద, తొందరగా బయలుదేరు."

నేను నిశ్చేష్టుణ్ణయాను.

నలుగురు మనుషులు మాస్టారి శవాన్ని టాక్సీలో పెడుతున్న దృశ్యం చూడలేక, కళ్ళు కప్పుకుని, ఉప్పెనలా ఉబికి వస్తున్న దుఃఖానికి లొంగిపోతూ నిలుచుండిపోయాను. ★

